సాక్షి తిరుపతి

7

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



క్రీడలతో మానసిక వికాసం

తిరుపతి రూరల్: క్రీడలతో విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. - 8లో



వీరాభిమానం

ఆయనో సన్నకారు రైతు.. ఆయన తన మోటార్‌సైకిల్, కళ్లజోడు అన్నింటా సీఎం జగన్, వైఎస్సార్ చిత్రాలు పెట్టుకున్నాడు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	26
చిత్తూరు	34	24
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విభాగానికి చెందిన ఉన్నతాధికారి తప్పకుండా హాజరుకావాల్సి ఉందన్నారు. కలెక్టరేట్‌లో అర్జీలు రాయడానికి ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఏలను ఏర్పాటు చేశామన్నారు. సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం తప్పనిసరిగా స్పందన వినతులు స్వీకరించాలని పేర్కొన్నారు.

వరదరాజస్వామి ఆలయ పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి రివైజ్డ్ ఎస్టిమేషన్ అనుమతుల మేరకు రూ.5.90 కోట్లు మంజూరు కావడంతో పెండింగ్‌లో ఉన్న 15 లేయర్ల నిర్మాణానికి సంబంధించి టెక్నికల్ అనుమతులు వచ్చాయన్నారు. సాంకేతిక కారణాలతో మందగించిన పనులను వెంటనే వేగవంతం చేయాలన్నారు. రానున్న వైకుంఠ ఏకాదశి నాటికి ఆలయ పనులు పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ కిషోర్, స్థపతి కుమార్, ఆలయ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు, కాంట్రాక్టర్ విజయభాస్కర్, యువకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి ఉదయ్‌శేఖర్ రెడ్డికి సీఎం జగన్ పరామర్శ

వాకాడు: నేదురుమల్లి ఉదయశేఖర్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యుడు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి ఈ నెల 4న మరణించారు. ఈ విషయాన్ని పార్టీ ముఖ్య నేతలు తెలపడంతో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పద్మనాభరెడ్డి కుమారుడు నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఉదయ్‌శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉదయం 11 గంటల సమయంలో తనకు ఫోన్ చేసి సీఎం జగన్ సార్ మీతో మాట్లాడుతారని చెప్పారన్నారు. వెంటనే తనకు ఎక్కడలేని ధైర్యం వచ్చిందన్నారు. 'అన్నా.. నాన్నకు ఏవైనా మేజర్ ప్రాబ్లమా.. ఎలా జరిగింది..' అని జగనన్న తనను సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారని తెలిపారు. దీంతో తాను నాన్న ఆరోగ్య పరిస్థితి ఎలా విషమించిన సంగతిని సీఎం వైఎస్ జగనన్నకు వివరించానని చెప్పారు. 'అన్నా.. మీరూ అమ్మను బాగా చూసుకుంటూ ధైర్యంగా ఉండాలి.' అని జగనన్న తనకు ధైర్యం చెప్పారన్నారు. మీరు అక్కడ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఒకసారి రండీ కలుద్దామని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని చెప్పారు.

ఊరూరా రెవెన్యూ సమస్యలు... పొలం గట్టు వద్దో.. స్థలం సరిహద్దు వద్దనో వివాదం. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం.. కుటుంబాలు వీధిన పడి చిన్నాభిన్నం కావడం గ్రామీణ ప్రాంతాల్లో చూస్తుంటాం. పాదయాత్ర సమయంలో భూ సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటికి చెక్ పెట్టడానికి భూ రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం పూర్తయితే భూ లెక్కలు పక్కాగా మారనున్నాయి. ఫలితంగా భూ యజమానుల స్థిరాస్తులకు భద్రత, భరోసా చేకూరనుంది.

డ్రోన్‌తో సర్వేలో అధికారులు



భూముల సర్వే వివరాలు

- సర్వే చేయాల్సిన భూములు: 15,40,351 ఎకరాలు
- సర్వే చేసిన భూములు: 2,65,457 ఎకరాలు
- మొత్తం సర్వే గ్రామాలు: 1,051
- తొలిదశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు: 74
- రెండో దశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు: 106
- మూడో దశలో సర్వే చేస్తున్న గ్రామాలు: 140
- సర్వేయర్ల సంఖ్య: 421 మంది

భూలెక్క.. ఇక పక్కా

- కొనసాగుతున్న మూడో విడత రీసర్వే
- 140 గ్రామాల్లో మూడో దశ సర్వే ప్రారంభం
- సర్వేతో పరిష్కారం కానున్న భూవివాదాలు
- అత్యాధునిక టెక్నాలజీతో జోరుగా భూ సర్వే

తిరుపతి అర్బన్: వందేళ్ల కిందట బ్రిటీష్ వారు సర్వే చేపట్టిన తర్వాత 2020 వరకు ఏ నాయకుడు దాని జోలికి వెళ్లలేదంటే అతిశయోక్తికాదు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం పేరుతో సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వే జిల్లాలో శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే డ్రోన్ల ద్వారా జిల్లాలో సర్వే పూర్తి చేసిన అధికారులు ప్రస్తుతం భూముల ప్యూరిఫికేషన్, సరిహద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి పూర్తయితే రైతులకు భూహక్కు పత్రాలను దశల వారీగా పంపిణీ చేయనున్నారు.



హద్దులు పరిశీలిస్తున్న సర్వే అధికారులు

పూర్తయిన డ్రోన్ సర్వే...

జిల్లాలో 1,051 గ్రామాల్లో భూసర్వే చేపట్టాల్సి ఉంది. ముందుగా డ్రోన్ సర్వే చేసి, ఎంత విస్తీర్ణంలో సర్వే చేయాల్సి ఉందనే అంశంపై ఓ నిర్ణయానికి వస్తారు. కాగా తిరుపతి జిల్లాలో 1,051 గ్రామాల్లో 15,40,351 ఎకరాల్లో సర్వే చేయాలని డ్రోన్ సర్వే వెల్లడించింది. తర్వాత దశల వారీగా సర్వే జోరుగా సాగుతుంది. తొలి దశలో 74 గ్రామాలు, రెండో దశలో 106 గ్రామాల్లో అన్ని దశల సర్వే పూర్తి చేయడంతోపాటు 2,65,457 ఎకరాలకు సంబంధించి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడం, భూహక్కు పత్రాలను పంపిణీ పూర్తి చేశారు. మూడో దశలో 140 గ్రామాల్లో సర్వే సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. నవంబర్ 30వ తేదీకి పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

ఐదు అంచెలుగా భూముల ప్యూరిఫికేషన్

జిల్లాలో భూముల ప్యూరిఫికేషన్‌ను ఐదు అంచెలుగా విభజించి, క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, వాస్తవ పరిస్థితి గుర్తించాల్సి ఉంటుంది. వీఆర్వో, ఆర్‌ఐ, తహసీల్దార్, ఆర్డీఓ, జేసీలు రికార్డుల పరిశీలిస్తారు. జేసీ స్థాయిలో పరిశీలన పూర్తయిన గ్రామాల్లో డ్రోన్ మ్యాప్, ఫీల్డ్ అజమాయిషీ రికార్డుల ఆధారంగా హద్దులు గుర్తించి, కొత్త రికార్డులు సిద్ధం చేస్తారు. తొలి దశగా డ్రోన్ సర్వేతో గ్రామ సరిహద్దులు గుర్తిస్తారు. రెండో దశగా ప్రభుత్వ, ప్రైవేటు, పోరంబోకు భూముల వివరాలను గుర్తిస్తారు. మూడో దశగా భూమి యజమానికి నోటీసుకు జారీ చేసి సర్వే వివరాలను వెల్లడిస్తారు. తమకు ఉన్న భూమి వాస్తవికతను తెలియజేసి అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. నాలుగో దశగా స్పష్టమైన భూ రికార్డులను తయారు చేస్తారు. ఐదో దశగా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి, భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తారు.

సమర్థవంతంగా భూ సర్వే



జిల్లాలో భూముల సర్వే సమర్థవంతంగా చేపడుతున్నాం. తప్పులకు తావులేకుండా స్పష్టమైన రికార్డులను తయారు చేయాలని ఆదేశించాం. స్పందనకు వచ్చే అర్జీల్లో అత్యధికంగా భూసమస్యలే. సర్వే పూర్తి అయితే భూ సమస్యలు నామమాత్రంగా ఉంటాయని భావిస్తున్నాం. ఎప్పటికప్పుడు సర్వేలో పురోగతి చూపుతున్నాం. రైతులు పూర్తి సహకారం అందిస్తున్నారు. సర్వేకి అవసరమైన మేరకు సిబ్బంది, పరికరాలను అందించాం. గడువు లోపు సర్వే పూర్తి చేస్తాం. దీంతో రైతులకు భూ సమస్యలుండవు. –కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్

రెండు దశల్లో సర్వే పూర్తి



రెండు దశల్లో సర్వే పూర్తి చేశాం. మూడో దశ నాలుగు రోజుల క్రితం ప్రారంభించాం. వేగవంతంగా సర్వే చేయడంతోపాటు తప్పులకు తావులేకుండా రికార్డులు తయారు చేయిస్తున్నాం. జిల్లా కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ పూర్తి సహకారం అందిస్తున్నారు. మరోవైపు రైతులు సహకరిస్తున్నారు. దీంతోనే వేగవంతంగా సర్వే చేస్తున్నాం. సర్వే పూర్తి అయిన వెంటనే సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నాం. – జయరాజ్, జిల్లా సర్వే అధికారి

స్థిరాస్తులకు సర్వే భరోసా



భూముల సర్వే చేపట్టడంతో అందరి స్థిరాస్తులకు ఓ భరోసా వస్తోంది. నా పొలం 2.5 ఎకరాలు సర్వే చేసి, భూహక్కు పత్రాలను ఇచ్చారు. నిత్యం గ్రామాల్లో భూముల వివాదాలు కొనసాగుతున్నాయి. భూముల ధరలకు రెక్కలొచ్చే కొద్దీ వివాదాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసి, రికార్డులు అందిస్తున్నారు. ఈ ప్రభుత్వం పనితీరుపై అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. –వాసురెడ్డి, రైతు, అప్పంబట్టు పిచ్చాటూరు మండలం

స్పేస్ వాక్



ర్యాలీని ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ వారి ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో స్పేస్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి హోలీ క్రాస్ సెంటర్ మీదుగా డీఓఎస్ కాలనీ వరకు నిర్వహించిన స్పేస్ వాక్ కార్యక్రమాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పరంగా అంతరిక్ష పరిశోధనల ద్వారా మనం దేశంలో సాంకేతిక పరమైన విప్లవాన్ని తీసుకొచ్చామని అన్నారు. ఇస్రో చేస్తున్న ప్రయోగాలతో సాధించిన సాంకేతిక ప్రగతి గురించి తెలియజేసేందుకే ఈ స్పేస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు విచ్చేసి స్పేస్ వాక్ ర్యాలీలో పాల్గొని, భరతమాతకు జై, ఇస్రో జై జై అంటూ నినాదాలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా షార్ అధికారులు భవిష్యత్తులో ప్రయోగించబోయే మానవ సహిత ప్రయోగ రాకెట్ హ్యూమన్ రేటెడ్ లాంచింగ్ వెహికల్ (హెచ్‌ఆర్‌ఎల్‌వీ) నమూనాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, ఈ ప్రోగ్రామ్ చైర్మన్ నంబు ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ రమేష్ బాబు, తహసీల్దార్ కే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, షార్ ఉద్యోగులు

చల్లా బాబుకు స్వగ్రామంలో షాక్



రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



తిరుపతిసిటీ: మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి, వైస్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీలో చేరిక
- బొమ్మయ్యగారిపల్లెకు చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తల చేరిక

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి సొంత గ్రామం బొమ్మయ్యగారిపల్లెలో భారీ షాక్ తగిలింది. రెండుసార్లు టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన గుండ్లూరి రామచంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ నాయకులు రాజారెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్, భాస్కర్‌శెట్టి, మునిరెడ్డి వారి అనుచరులతో కలసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలు అందించామన్నారు. కష్టకాలంలో ఆర్థికంగా తోడున్న తమకు గుర్తింపు లేదన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి చూసి వైఎస్సార్‌సీపీలో చేరామని తెలిపారు. వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తానని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, నాయకులు డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న 33వ డివిజన్ పార్టీనేతలు

300 మంది టీడీపీ కార్యకర్తల చేరిక

తిరుపతి సిటీ: వైఎస్సార్ సీపీలో కొనసాగడం ఒక గౌరవం, హోదాగా భావించాలని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పద్మావతి పురంలోని ఆయన నివాసంలో తిరుపతి 33వ డివిజన్ స్కావెంజర్స్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కీలక నేత, వార్డు అధ్యక్షుడు ఎస్వీ రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు సుమారు 300 మందికి పైగా ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే భూమన వారికి పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంత పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుని నమ్మకమన్నారు. చంద్రబాబు అండ్ కో పార్టీ, పవన్ లాంటి వారు డబ్బున్న వాళ్లకు కొమ్ముకాసే వ్యక్తులని, వారిని ప్రజలు విశ్వసించరన్నారు. దూది శివ, కార్పొరేటర్ దూది కుమారి, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఇమామ్ ఆధ్వర్యంలో రమణారెడ్డి బృందం చేరికతో 33వ డివిజన్ పార్టీ మరింత బలపడిందన్నారు. 33వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు దూది శివ రాయల్ మాట్లాడుతూ దేశంలో సామాన్య ప్రజల సమస్యలు విని వారికి అండగా నిలిచి పోరాడే ఎమ్మెల్యే మనకు దొరకడం అదృష్టమన్నారు. అనంతరం కార్యకర్తలు ఎమ్మెల్యేని గజమాలతో సత్కరించారు. తరువాత ఎమ్మెల్యే టీడీపీ నాయకులు ఎస్వీ రమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీకాంత్ ,బాలాజీ, జ్యోతి, అంజలి, లక్ష్మీ, ఝాన్సీ, మహేష్ రాయల్, రామ్మోహన్, మణి ఆచారి, అనీల్ కుమార్, శేఖర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, పవన్ కుమార్, విజయ, మోహన్‌రెడ్డి, కోదండ, గుణ, రాజేశ్వరి, చరణ్ బృందానికి వైఎస్సార్ సీసీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలలోకి తీసుకెళ్లాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్నాయని, అందరం కలసి కట్టుగా పనిచేయాల్సి అవసరముందన్నారు. అనంతరం పార్టీ నాయకులు అభినయ్‌రెడ్డి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, పూసపాటి మోహన్‌రాజ్, ఇమ్రాన్ బాషా, దినేష్ రాయల్, లవ్‌లీ వెంకటేష్, పద్మజ, మద్దాలి శేఖర్ రాయల్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక

ఏర్పేడు: మండలంలోని కందాడు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు గుడ్లూరు శేషాద్రి నాయుడు మరో 10 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి స్వగ్రామమైన మండలంలోని మన్నసముద్రంలో ఆదివారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నేతతో పాటు 10 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. వారికి ఎంపీ, ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ వనజ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు తాళ్లపాక నాగార్జునరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గిరి, నాగవేణి, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 72,309 మంది స్వామివారిని దర్శించుకోగా 26,296 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గంగాసుతుని జల విహారం



తెప్పపై విహరిస్తున్న వరసిద్ధి వినాయకస్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రత్యేక వార్షిక ఉత్సవాల్లో చివరిరోజు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చన పూజలు జరిగాయి. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేసి విశేషాలంకరణ చేశారు. అనంతరం మేళ తాళాలతో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పపై కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామివారు మూడు ప్రదక్షిణలు జలవిహారం చేశారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు సాయంత్రం నుంచి పుష్కరిణి చుట్టూ కూర్చున్నారు. స్వామివారు జలవిహారం చేస్తుంటే భక్తుల జై గణేష..జైజై గణేష నామస్మరణలు మార్మోగాయి. ఆలయ ఈఓ వెంకటేశు, తాజా మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


జ్ఞాపిక అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో స్కూల్‌మేళా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దేశ, రాష్ట్ర చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలు, క్రీడా రంగం, శాస్త్రవేత్తలు, పరిశోధనలు తదితర అంశాలపై జిల్లాలోని 50 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజయం సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు నగదుతోపాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజేష్, అరుణ్‌కుమార్, హేమంత్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, ప్రజాప్రగతి ట్రస్టు మండల కన్వీనర్ చంద్రశేఖర్, ఐఐటీ తిరుపతి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మహేష్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

తిరుపతి క్రైమ్: కొర్లగుంటలోని బాలాజీ హాస్పిటల్ వెనకవైపు ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. టీవీ మెకానిక్ లీలాకృష్ణ బాలాజీ హాస్పిటల్ వెనకవైపు ఉన్న మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. సొంత పనులు నిమిత్తం శనివారం ఉదయం భార్యాభర్తలిద్దరూ పాకాలకు వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా సుమారు 120 గ్రాములు బంగారం చోరీ జరిగినట్టు గుర్తించారు. దీనిపై ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలంలో వేలిముద్రలు సేకరించారు.

క్రీడలతో మానసిక వికాసం

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–17 తైక్వాండో పోటీలు ప్రారంభం


తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసం పెరుగుతుందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ – 17 బాలబాలికల తైక్వాండో పోటీలు, ఎంపిక ప్రక్రియ ఆదివారం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థుల్లో ఆత్మరక్షణకు సంబంధించిన క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ఇలాంటి పోటీలను పట్టణాలకే పరిమితం కాకుండా పల్లెల్లో కూడా ప్రారంభించాలన్నారు. నాడు– నేడు పథకం కింద ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు అందంగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. చిన్నారుల్లో క్రీడాశక్తిని పెంపొందించేందుకు తన వంతు బాధ్యతగా వ్యవహరిస్తానని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, ఆ దిశగా వారిని గొప్పగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ తైక్వాండో పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మొదటిసారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాను ఎంపీటీసీ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్న పెరుమాళ్లపల్లె పాఠశాల వేదిక కావడం సంతోషకరమన్నారు. ఈ పోటీలకు చిత్తూరు, తిరుపతి అన్నమయ్య జిల్లాల నుంచి సుమారు వందమంది బాలబాలికలు హాజరుకానున్నట్లు కార్యనిర్వహణ కార్యదర్శి బట్టు నాగమల్లేశ్వరి తెలిపారు.

రూ.25 వేల విరాళం

తైక్వాండో క్రీడలను ప్రోత్సహించేందుకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తన వ్యక్తిగత నగదు రూ.25 వేలు పెరుమాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌కు విరాళంగా అందజేశారు. తైక్వాండోకు కావాల్సిన మాట్స్ కొనుగోలు చేయాలని సూచించారు. 2017 నుంచి సుమారు జిల్లాస్థాయికి 73 మంది, రాష్ట్ర, జాతీయ స్థాయికి 14 మంది ఎంపికై పతకాలు సాధించారని తెలిపారు. ఈ ఘనత పెరుమాళ్లపల్లె పాఠశాలకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వరరెడ్డి, సర్పంచ్ జోగి మోహన్, ఉప సర్పంచ్ వెంకట్ నారాయణ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్ బాబు, జిల్లా వ్యాయామ సంఘం కార్యదర్శి బొందు సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో దేవాంగ సత్రం అద్భుతం


సమావేశంలో మాట్లాడుతున్న హంపీ గాయత్రి పీఠాధిపతి దయానందపూరి మహాస్వామిజీ

- హంపీ గాయత్రి పీఠం పీఠాధిపతి దయానందపూరి మహాస్వామి

తిరుపతి కల్చరల్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల శ్రీవారి పాదాల చెంతనున్న తిరుపతిలో దేవాంగులకు ఉచిత వసతులతో కూడిన దేవాంగ సత్రం తిరుపతి యూనివర్సల్ ప్రాజెక్టు చేపట్టడం అద్భుతమని హంపీ గాయత్రి పీఠ మహా సంస్థాన పీఠాధిపతి దయానందపూరి మహాస్వామీజీ కితాబిచ్చారు. శ్రీనిత్య శ్రీనివాస ఉమారామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రం ఆధ్వర్యంలో ఆదివారం పాత తిరుచానూరు రోడ్డులోని అంకాలమ్మ ఆలయ సమీపంలో నిర్మాణ దశలో ఉన్న సత్రం ఆవరణలో సత్రం మహాజన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. ఈ సత్రంతో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వడం, వృద్ధాశ్రమాలు నిర్వహించడం, టాలెంట్ కోచింగ్ కాంపిటీటివ్ శిక్షణ, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ప్రస్తుతం దేవాంగ సత్రం, ఉచిత అన్నదానం, కాశీ, శ్రీశైలం, శ్రీకాళహస్తిలో నిర్వహణ చాలా బాగుందన్నారు. అనంతరం దేవాంగ సత్రం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మన దుర్గాప్రసాద్‌రావు, నక్కిన చిన వెంకట్రాయుడు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది దేవాంగులు ఉన్నారని, వారి సామాజిక, ఆర్థిక, విద్యాప్రగతికి తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. తిరుపతిలో దేవాంగ సత్రం నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సమాజానికి సేవలందించిన దేవాంగ సామాజిక వర్గానికి చెందిన పది మందిని దేవాంగరత్న బిరుదలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మంచు కుమారస్వామి, డాక్టర్ మధుసూదన్‌రావు, డాక్టర్ శెట్టి జోగారావు, దొంతంశెట్టి రత్నారెడ్డి, మల్లేశ్వర రావు, త్రినాథరావు, బొమ్మన సత్యరాజకుమార్, బొమ్మన అశ్వని, అరవింద్, వంశీకృష్ణ, వివిధ ప్రాంతాలకు చెందిన దేవాంగ సామాజిక వర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమ సమాజ స్థాపకులు


ప్రైవేటు ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, అపుస్మా నాయకులు విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు సమ సమాజ స్థాపకులని, వారిని గౌరవించడం అందరి బాధ్యత అని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని ఎంఎంబీజీ పాఠశాలలో ఆదివారం ఏపీ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు మాత్రమేనన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువులు జ్ఞానాన్ని అందించి మన జీవితానికి చక్కని బాట వేస్తారని చెప్పారు. అందుకే గురువులకు మన సమాజంలో గౌరవ ప్రదమైన స్థానముందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. డీఈఓ వి.శేఖర్ మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ప్రభుత్వ పాఠశాలలకు సమానంగా ప్రైవేటు పాఠశాలలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సుమారు 200 మందికి పైగా ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు ఎస్.విశ్వనాథరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, కేఎస్.వాసు, ఓ.వెంకటరమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, భాస్కర్‌రాజు, జనార్దన్‌రెడ్డి, హరనాథ్‌శర్మ పాల్గొన్నారు.

తప్పు చేసినందువల్లే బాబు జైల్లో ఉన్నాడు



శ్రీవారి ఆలయం ఎదుట మంత్రి మేరుగు నాగార్జున, కుటుంబసభ్యులతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున

తిరుమల: తప్పు చేసినందువల్లే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జైలుకెళ్లాడని రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితుల వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ మళ్లీ గెలవాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. పేదలకు సుపరిపాలన అందిస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. తప్పు చేసినందువల్లే చంద్రబాబు జైల్లో ఉన్నారని తెలిపారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు 175 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టలేని పరిస్థితిని సీఎం తెచ్చారన్నారు. ఆ ఒక్కటి చాలు సీఎం జగన్ రాజకీయ చాణుక్యుడని చెప్పడాకి అని పేర్కొన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబే 175 స్థానాల్లో అభ్యర్థులను పెట్టలేక పోతున్నారని తెలిపారు. మహిళలపై వ్యాఖ్యలు చేయడం మూర్ఖుల దుశ్చర్య అన్నారు. మహిళా మంత్రిని అలా మాట్లాడినందునే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.


మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మంత్రి మెరుగు నాగార్జున దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దొరవారిసత్రం: మండలంలోని కలగుంట సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద డౌన్ లైన్ పట్టాలపై రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకోగా ఆదివారం వెలుగుచూసింది. సూళ్లూరుపేట రైల్వే పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే రైలు నుంచి 50–55 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడిపోయి మృతి చెందాడు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతుడు నీలిరంగు గళ్ల చొక్కా, నేవీబ్లూ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శివసామ్య తెలిపారు.

ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మృతి


డ్రైవర్ నాగభూషణం మృతదేహం

తిరుపతి తుడా: మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది ఆదివారం విధి నిర్వహణలో మృతి చెందారు. ఇంజనీరింగ్ విభాగంలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నాగభూషణం గుండెపోటుతో ఉదయం 8 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. వాటర్ ట్యాంకర్‌కు నీటిని నింపుకుని రాయల్ నగర్ లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మార్గం మీదుగా ఎంఆర్ పల్లెకు వెళుతున్న క్రమంలో గుండెపోటు వచ్చింది. సెకండ్ల వ్యవధిలోనే ట్రాక్టర్‌ను నిలిపివేశాడు. అంతే వేగంగా ట్రాక్టర్ నుంచి కిందకి కుప్పకూలిపోయాడు. మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి అక్కడికి చేరుకుని తదుపరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కింద పడిపోయిన వెంటనే 108కు సమాచార ఇవ్వగా చనిపోయిన వ్యక్తులను తాము ఆస్పత్రికి తీసుకు వెళ్లమని నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాగభూషణం మృతదేహాన్ని గంట తర్వాత ప్రైవేట్ అంబులెన్స్‌లో రుయాకు తరలించి, పోస్టుమార్టమ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య విభాగంలో పనిచేస్తున్న కోబాకు రాజా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఉదయం విధి నిర్వహణలో ఉండగా ఆయన మృతి చెందాడు. కుటుంబ సభ్యులను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి పరామర్శించారు. ఇద్దరు సిబ్బంది మృతి విషయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



గాయపడిన బాలకృష్ణ, సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై ప్రైవేటు కూలీగా పనిచేసే ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బీఎన్ కండ్రిగ మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపాళెం దళితవాడకు చెందిన బాలకృష్ణ (28) విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం పల్లమాల గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో బోరు మోటారు పనిచేయడం లేదని లైన్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో లైన్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయాలని బాలకృష్ణకు తెలిపారు. దీంతో బాలకృష్ణ పొలాల వద్దకు వెళ్లగా లైన్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పల్లమాల గ్రామంలోని సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ఆలత్తూరు, పల్లమాల ఫీడర్లకు ఎల్‌సీ కావాలని షిఫ్ట్ ఆపరేటర్ మనోహర్‌ను కోరగా ఎల్‌సీ ఇచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ కాటూరు ఫీడర్‌లో ఉంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ సరఫరా ఆగలేదు. ఇది తెలియని బాలకృష్ణ మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పల్లమాల సబ్‌స్టేషన్‌లోను భారీ శబ్దం రావటంతో షిఫ్ట్ ఆపరేటర్ మనోహర్ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇది గమనించిన రైతులు విద్యుత్ వైర్లలో ఇరుకుపోయిన బాలకృష్ణను కిందకు దింపి శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనకు ట్రాన్స్‌కో అధికారులు బాధ్యత వహించాలని కొత్తపాళెం గ్రామస్తులు సబ్‌స్టేషన్ గేటు మూసి, కంచె అడ్డుగా వేసి ఆందోళన చేపట్టారు. లైన్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర చేయాల్సిన పనిని బాలకృష్ణ చేసి, ప్రాణాలను కొల్పోయాడని వాపోయారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

వీరాభిమానం

- వైఎస్సార్ కుటుంబం అంటే ప్రాణం
- మోటారు సైకిల్‌కు వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలు


వైఎస్సార్, వైఎస్.జగన్ చిత్రాలతో ఉన్న మోటారు సైకిల్‌తో విజయశేఖర్‌రెడ్డి



బైక్‌పై వైఎస్సార్, జగనన్న చిత్రాలు, విజయ సూచిక

నాయుడుపేట టౌన్: ఆయనో సన్నకారు రైతు. ఆయనకు దివంగతనేత వైఎస్.రాజశేఖరరెడ్డి కుటుంబం అంటే ప్రాణం. వైఎస్సార్ తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటే అంతులేని అభిమానం. వారిపై ఉన్న అభిమానాన్ని చాటి చేప్పేలా ఆ రైతు తన మోటారు సైకిల్ మొత్తం వైఎస్.రాజశేఖరరెడ్డి, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. కళ్లజోళ్లు, కండువా అన్నింటిపై జగనన్న మన సీఎం అన్న చిత్రాలు ముద్రించుకుని, తన అభిమానాన్ని చాటుకున్నాడు. 1996లో వైఎస్.రాజారెడ్డిని సైతం కలవడానికి పులివెందులకు సైకిల్‌పై 80 కిలో మీటర్ల వరకు వెళ్లి మధ్యలో ఆయన్ని కలవ నివ్వరంటే వెనుతిరిగి వచ్చేశాడు. ఆయనే నాయుడుపేట మండలం, కూచివాడపాళెం గ్రామానికి చెందిన సన్నకారు రైతు వాకాటి విజయశేఖర్‌రెడ్డి. ఈయన ఏమి చేసినా ఓ ప్రత్యేకత ఉంటుంది. ఈ క్రమంలో అతని మోటారుసైకిల్‌తోపాటు హెల్మెట్, చెప్పులకు సైతం వైఎస్సార్, సీఎం జగన్ చిత్రాలతో ఆకర్షణీయంగా డిజైన్ చేసుకుంటూ అబ్బురపరుస్తూ ఎన్నికల సమయంలో అనేక ప్రాంతాల్లో బైక్‌పై పర్యటించారు. మన సీఎం జగనన్న అంటూ విస్తృత ప్రచారం చేశారు. పాదయాత్రలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్ట, సుఖాలు తెలుసుకున్నారని, అందుకే ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సంక్షేమానికి బాసటగా నిలిచారని చెబుతున్నారు. తిరిగి రాష్ట్రానికి దళపతి, అధిపతిగా తిరిగి రానున్నాడంటూ బైక్ ముందు భాగంలో స్టిక్కరింగ్ చేయించి తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. సీఎం జగన్ మోహన్ రెడ్డి హవా కొనసాగుతుందని, తిరిగి ప్రజల ఆశీస్సులతో దేవుని దీవెనలు, శత కోటి దేవతల అనుగ్రహంతో మళ్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించడం ఖాయమని చెబుతున్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి సోమవారం విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

8 మంది పేకాట రాయళ్ల అరెస్టు

తిరుపతి క్రైమ్: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ అప్పన్న తెలిపారు. సీఐ కథనం మేరకు.. మధురానగర్లోని సెవెన్ హిల్స్ స్కూల్ పక్కన ఓ ఇంట్లో జూదమాడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీనిపై స్పందించిన సీఐ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.16,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మండలం ఏనుగుంట్లపల్లెలో ఆదివారం ఎస్ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో చంద్రప్రకాష్ (35) అనే వ్యక్తి వద్ద 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. అతని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ బాబు, రాంప్రసాద్, సిబ్బంది శంకరనాయక్, బాబు, జయశంకర్, సురేంద్ర, వెంకటేష్, సాలాక్షి, శైలజ తదితరులు పాల్గొన్నారు.